నర్సరీ రైతులకు పెట్రోల్ పాట్లు

- ఎన్నికల నేపథ్యంలో నిబంధనలు
- టిన్నుల్లో పెట్రోల్ నింపటానికి బంక్‌ల నిరాకరణ
- స్ప్రేయర్లకు పెట్రోల్ తప్పనిసరి


మోటారు స్ప్రేయర్‌లో పెట్రోల్‌ను నింపుతున్న దృశ్యం

కడియం: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో 144 సెక్షన్ అమలులో ఉంది. ముందు జాగ్రత్తగా పలు చర్యలు చేపట్టారు. అందులో భాగంగా పెట్రోల్ బంకుల్లో వాహనాల్లో మినహా సీసాలు, టిన్నుల్లో పెట్రోల్ నింపొద్దని ఉన్నతాధికారుల నుంచి లిఖిత పూర్వకంగా ఆయా బంక్‌లకు ఆదేశాలు జారీ అయ్యాయి. అయితే ఈ ఆదేశాల కారణంగా నర్సరీ రైతులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. నర్సరీల్లో వినియోగించే తైవాన్ స్ప్రేయర్లు, పవర్ స్ప్రేయర్లు, ఇంజిన్ స్ప్రేయర్లు పెట్రోల్ సాయంతోనే నడుస్తాయి.

గతంలో..

గతంలో టిన్నులను తీసుకువెళ్లి బంకుల్లో పెట్రోల్ నింపుకొని రైతులు తెచ్చుకునేవారు. అధికారుల ఆదేశాల నేపథ్యంలో బంక్‌ల యాజమాన్యం టిన్నుల్లో పెట్రోల్‌ను నింపేందుకు నిరాకరిస్తున్నాయి. దీంతో ఆయా స్ప్రేయర్లలో పెట్రోల్‌ను ఏ విధంగా నింపుకోవాలో అర్థం కాక రైతులు దిక్కులు చూస్తున్నారు. ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ పూర్తయ్యే వరకూ పెట్రోల్‌ను ఇచ్చేది లేదని చెబుతున్నారు.

మందుల పిచికారీ ఎలా..

ప్రస్తుత వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో వారానికి రెండు, మూడు సార్లు రసాయన మందులు పిచికారీ చేయాల్సి ఉంటుంది. మామిడి, నిమ్మ, బత్తాయి, దానిమ్మ, సీతాఫలం, రామాఫలం తదితర పండ్ల రకాలతో పాటు అశోక, కానుగ తదితర అవెన్యూ రకాల మొక్కలకు వాతావరణ పరిస్థితులను అనుసరించి ప్రతి రెండు,మూడు రోజులకొకసారి పురుగు మందులు పిచికారీ చేయాల్సిన అవసరం ఉంటుంది. ఇలా పిచికారీ చేయాలంటే స్ప్రేయర్‌ను వినియోగించాలి. ఇందుకోసం కడియం మండలం వ్యాప్తంగా వెయ్యికిపైగా ఇంజిన్ స్ప్రేయర్లు ఉంటాయని అంచనా.

రైతుల అవస్థలు

ఇంజిన్ స్ప్రేయర్లు పనిచేయడానికి అవసరమైన పెట్రోల్‌ను ఇచ్చేందుకు బంక్‌ల వారు నిరాకరిస్తున్నారు. బ్యాటరీ స్ప్రేయర్లు ఉన్నప్పటికీ మాటిమాటికీ నీటిని నింపాల్సి రావడంతో కూలీల ఖర్చు, సమయం వృథా అవుతున్నాయి. దీంతో ఎవరికి మొరపెట్టుకోవాలో అర్థం కాక రైతులు ఇబ్బందులు పడుతున్నారు. మోటారు సైకిళ్ల ట్యాంకులలో పెట్రోల్ నింపుకొని, పొలాలకు తీసుకువచ్చి, అక్కడ బాటిళ్లలో వేసి వినియోగించుకుంటున్నారు. పదేపదే ఒకదానిలో నుంచి మరో దానిలోకి పోయడం వల్ల పెట్రోల్ ఆవిరైపోతోందని, దీనికి తోడు శ్రమతో కూడుకున్న పనని రైతులు వాపోతున్నారు.


బంక్‌లకు ఉన్నతాధికారులు జారీ చేసిన లిఖిత పూర్వక ఆదేశాలు

మర పడవలదీ అదే పరిస్థితి

గోదావరిలో మరపడవల వారు కూడా ఇదే ఇబ్బందిని ఎదుర్కొంటున్నారంటున్నారు. పడవలకు అవసరమైన డీజిల్, పెట్రోల్‌ను టిన్నుల్లో నింపడానికి బంక్‌ల యజమానులు నిరాకరిస్తున్నారని, దీంతో పడవలు నడపలేకపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నర్సరీ రైతులకు ఏదైనా గుర్తింపును చూపిస్తే పెట్రోల్, డీజిల్ ఇచ్చే విధంగా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని వారు కోరుతున్నారు.


మోటారు సైకిల్ నుంచి పెట్రోల్‌ను తీసుకుంటున్న రైతులు

క్లుప్తంగా

372 మందికి వైద్య పరీక్షలు


దామిరెడ్డిపల్లిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్

కడియం: ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా మండలంలోని దామిరెడ్డిపల్లి సచివాలయం-1 పరిధిలో మంగళవారం ఏర్పాటు చేసిన శిబిరంలో 372 మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించినట్లు ప్రభుత్వ వైద్యురాలు డాక్టర్ జి.స్వరూప తెలిపారు. డాక్టర్ బి.నవ్యరాగ, సీహెచ్ ఆనందరావు ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్, ఆప్తమాలజీ తదితర విభాగాల్లో వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. ఆరోగ్యశ్రీకి ఒకరిని రిఫర్ చేసినట్లు వివరించారు. పంచాయతీ కార్యదర్శి కె.విజయరాజు తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలను అతిక్రమిస్తే చర్యలు


వినయ్ మోహన్, సీఐ

ధవళేశ్వరం: అనుమతులు లేకుండా బహిరంగ సభలు, ఊరేగింపులు, విజయోత్సవాలు నిర్వహించకూడదని ధవళేశ్వరం సీఐ జీవీ వినయ్ మోహన్ పేర్కొన్నారు. విజయోత్సవ ర్యాలీలకు కూడా అనుమతులు లేవన్నారు. ఎన్నికల లెక్కింపు పరిణామాల అనంతరం మాత్రమే అనుమతులపై పరిశీలించడం జరుగుతుందన్నారు. శాంతి భద్రతల సమస్యలు సృష్టించినా, ప్రేరేపించినా చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఇప్పటికే విస్తృతంగా సోదాలు నిర్వహిస్తున్నామని వివరించారు. ఎన్నికల లెక్కింపు ప్రశాంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. పెట్రోల్, డీజిల్‌లను విడిగా విక్రయించవద్దని పెట్రోల్ బంక్ యాజమాన్యాలకు ఇప్పటికే సమాచారం ఇచ్చామన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే ఉపేక్షించేది లేదన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచామన్నారు.

ఉపాధ్యాయుడికి అభినందనలు

కంబాలచెరువు: ఇటీవల గౌరవ డాక్టరేట్ పొందిన మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయుడు కట్టుంగ సీతారామాంజనేయులును జిల్లా పాఠశాల విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు మంగళవారం అభినందించారు. రామాంజనేయులు బోధనా నైపుణ్యాలు, ఆయన చేస్తున్న సామాజిక సేవలను గుర్తించి కర్ణాటకకు చెందిన భారత్ వర్చ్యుయల్ యూనివర్సిటీ ఫర్ పీస్ అండ్ ఎడ్యుకేషన్ ఈ గౌరవాన్ని ప్రకటించింది. స్థానిక ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రాష్ట్రస్థాయి పాల్ లాబ్ శిక్షణలో ఆంజనేయులును డీఎస్ఈవో అభినందించారు.

సెబ్ విస్తృత దాడులు


నిందితుడితో సెబ్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ తదితరులు

రాజమహేంద్రవరం రూరల్: సెబ్ సౌత్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ పి.హనుశ్రీ, సిబ్బందితో కలిసి మంగళవారం సారా తయారీ కేంద్రాలపై విస్తృత దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఒక కేసు నమోదు చేశారు. వంద లీటర్ల సారా స్వాధీనం చేసుకుని, 2200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. కవలగొయ్యి గ్రామానికి చెందిన నిశ్చనకోళ్ల దుర్గయ్యను అదుపులోకి తీసుకున్నారు.

అక్రమంగా నిల్వ చేసిన బాణసంచా స్వాధీనం

సీతానగరం: ఎస్సై టి.రామకృష్ణ ఆధ్వర్యంలో పోలీసులు మంగళవారం మండలంలోని పలు గ్రామాల్లో అక్రమంగా నిల్వ ఉంచిన బాణసంచాను స్వాధీనం చేసుకున్నారు. పురుషోత్తపట్నం పంచాయతీ పరిధి రామచంద్రపురంలోని పి.వెంకట సూర్య ప్రకాష్ ఇంట్లో 175 తారాజువ్వలు 175, 15 తాటాకు బాంబుల కట్టలు స్వాధీనం చేసుకున్నారు. సీతానగరం నాలుగు బొమ్మల సెంటర్‌లో ఎం.సత్యనారాయణకు చెందిన గోడౌన్‌లో నిల్వ ఉంచిన 25 కట్టల తాటాకు బాంబులు, 4 కిలోల సిసింద్రీ మందు, అరకిలో సూరేకారం, కిలో మతాబు మందు సీజ్ చేశారు. నిందితులపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై రామకృష్ణ మాట్లాడుతూ ఎన్నికల ఫలితాల సందర్భంగా బాణసంచా కాల్చడం, అమ్మకాలు జరపడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సౌత్ జోన్‌లో కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్


కార్డన్ అండ్ సెర్చ్‌లో పాల్గొన్న సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్, పోలీసు బలగాలు

కంబాలచెరువు: రాజమహేంద్రవరం సౌత్ జోన్ పరిధిలో మంగళవారం కార్డన్ అండ్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు సౌత్ జోన్ డీఎస్పీ అంబికా ప్రసాద్ ఆధ్వర్యంలో రాజమహేంద్రవరం, ధవళేశ్వరం, కడియం ప్రాంతాల్లో ఈ కార్యక్రమం జరిగింది. డీఎస్పీ మాట్లాడుతూ ఎన్నికల కౌంటింగ్ ప్రక్రియ ప్రశాంతంగా జరిగేందుకు అందరూ సహకరించాలన్నారు. పోలీస్ యాక్ట్ సెక్షన్ 30 అమలులో ఉన్నందున ముందస్తు అనుమతి లేకుండా ఏ విధమైన ఊరేగింపులు, ప్రదర్శనలు, బహిరంగ సభలు, విజయోత్సవ ర్యాలీలు నిర్వహించకూడదన్నారు. బంకుల్లో పెట్రోలు, డీజిల్ లూజుగా బాటిళ్లలో, క్యాన్లలో అమ్మడం నిషిద్ధమన్నారు. రెండు రోజులుగా సోదాలు నిర్వహిస్తున్నామని, పాత నేరస్తులపై ప్రత్యేక నిఘా పెట్టామన్నారు. శాంతి భద్రతల సమస్యలు సృష్టించిన, ప్రేరేపించిన వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కార్డన్ అండ్ సెర్చ్‌లో నెంబర్ ప్లేట్‌లు లేని 10 మోటారు సైకిళ్లు, అలాగే 10 విస్కీ బాటిళ్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. దాడుల్లో టూటౌన్ సీఐ వి.శ్రీనివాస్, ధవళేశ్వరం ఇన్‌స్పెక్టర్ వినయ్ మోహన్, కడియం ఇన్‌స్పెక్టర్ బి.తులసీధర్, మూడు పోలీస్ స్టేషన్ల సిబ్బంది, కేంద్ర పారా మిలిటరీ బలగాలు పాల్గొన్నాయి.

రైల్వే స్టేషన్‌లో ఆధునీకరణ పనుల పరిశీలన


స్టేషన్‌లో పనులను పరిశీలిస్తున్న రైల్వే అడ్వైజరీ కమిటీ మెంబర్లు

రాజమహేంద్రవరం సిటీ: స్థానిక రైల్వే స్టేషన్ లో చేపట్టిన ట్రాక్ ఆధునీకరణ నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులకు రైల్వే అడ్వైజరీ కమిటీ మెంబర్లు సూచించారు. రాజమహేంద్రవరం ప్రధాన రైల్వే స్టేషన్‌లో జరుగుతున్న పనులను మంగళవారం వారు పరిశీలించారు. స్టేషన్‌లోని తాగునీరు, డస్ట్ బిన్లు లేకపోవడాన్ని గుర్తించి, ఆ సమస్యలను పరిష్కరించాలని సూచించారు. కుక్కలు లోపలకు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. బ్రిడ్జి మీద నీరు నిలిచిపోకుండా రేకులను అమర్చాలన్నారు. స్టేషన్ మేనేజర్ ఏబీఎస్ రంగనాథ్, సీటీఐ ఎస్.చంద్రమౌళి, స్టేషన్ ఎడ్వైజరీ కమిటీ సభ్యులు యానాపు ఏసు, సీహెచ్ సతీష్, ఎం.పరశురామ్, బి.హరిరామ్, వి.రామకృష్ణ, పీవీ సుబ్రహ్మణ్యం, హెల్త్ చీఫ్ ఇన్‌స్పెక్టర్ వి.శ్రీరాములు పాల్గొన్నారు.

గుత్తుల శ్రీనివాసరావు కార్టూన్‌కు బహుమతి


గుత్తుల శ్రీనివాసరావు, కార్టూనిస్ట్

కడియం: ఇటీవల జరిగిన కార్టూన్ పోటీల్లో వేమగిరి గ్రామానికి చెందిన ప్రముఖ కార్టూనిస్ట్ గుత్తుల శ్రీనివాసరావు గీసిన కార్టూన్ ఉత్తమ కార్టూన్‌గా ఎంపికైంది. తెలుగు కార్టూనిస్టుల దినోత్సవం సందర్భంగా హాస్యానందం మాసపత్రిక సౌజన్యంతో ప్రముఖ కవి రచయిత బ్నిం ఈ పోటీలు నిర్వహించారు. ఆ వివరాలను శ్రీనివాసరావు మంగళవారం స్థానిక విలేకరులకు తెలిపారు. విజేతలకు సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో నగర ప్రముఖుల చేతుల మీదుగా బహుమతి ప్రదానం జరిగిందన్నారు. ప్రస్తుతం చాలామంది తల్లిదండ్రులు తాము బిజీగా ఉండడం వల్ల పిల్లల్ని పెంచే బాధ్యత పూర్తిగా పనివాళ్లకు అప్పచెప్పేస్తూ, కాస్త ఖాళీ సమయం దొరికితే అప్పుడు కూడా ఫోన్లు, టీవీలతో కాలక్షేపం చేస్తున్నారు. వారి నిర్లక్ష్యం పిల్లలను ఎంత దూరం చేస్తుందో శ్రీనివాసరావు కార్టూన్ ద్వారా హాస్యాన్ని జోడించి చూపించారు. విభిన్నమైన ఈ కార్టూన్ పలువుర్ని ఆకట్టుకోవడమే కాకుండా అనేక మంది ప్రసంశలు అందుకుంది. సామాజిక సమస్యలపై స్పందిస్తూ తరచూ కార్టూన్లు గీసి అనేక రాష్ట్ర, జాతీయ స్థాయిలో బహుమతులు గెలుచుకున్న శ్రీనివాసరావు వృత్తి రీత్యా చదరంగ శిక్షకుడిగా పని చేస్తున్నారు.

జీవ వైవిధ్యాన్ని కాపాడుకుందాం


జీవ వైవిధ్య పోస్టర్లను ఆవిష్కరిస్తున్న గిరజాల బాబు తదితరులు

కడియం: నానాటికీ కాలుష్యం పెరిగిపోతున్న నేపథ్యంలో జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని బాధ్యతా సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గిరజాల బాబు అన్నారు. జీవ వైవిధ్య దినోత్సవాన్ని పురస్కరించుకొని పర్యావరణ మిత్ర అవార్డు గ్రహీత చిలుకూరి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కడియంలో మంగళవారం జీవ వైవిధ్య అవగాహన సదస్సు జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న బాబు మాట్లాడుతూ వాతావరణ కాలుష్యంతో ఇప్పటికే ఎన్నో జీవులు తమ ఉనికిని కోల్పోయాయన్నారు. కార్యక్రమంలో భాగంగా ఆంధ్రప్రదేశ్ జీవ వైవిధ్య మండలి ప్రచురించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులను అభినందించారు. జీవ వైవిధ్యం హరించిపోతే భవిష్యత్తులో ఈ భూగోళం మీద మానవ మనుగడకు అపాయం కలుగుతుందన్నారు. మాస్టర్ మైండ్ స్కూల్ కరస్పాండెంట్ గళ్లా చిరంజీవి, పశు వైద్యులు పుట్టా శ్రీనివాసరావు, బ్రాహ్మణ సంఘ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వేదాంతం నాని, పున్నమిరాజు వీర్రాజు, చెళ్లపిళ్ల వెంకటశాస్త్రి కళాసేవా సమితి అధ్యక్షులు అడపా సుబ్రహ్మణ్యం, మలసాని గోవిందు, చింతాడ హరి నాయుడు, బొర్రా రామకృష్ణ, యూటీఎఫ్ నాయకులు వేదుల శాస్త్రి పాల్గొన్నారు.

ట్రాన్స్‌ఫార్మర్లలో రాగితీగ చోరీ ముఠా అరెస్ట్

- రూ. 6 లక్షల విలువైన 600 కిలోల రాగి వైరు స్వాధీనం
- నలుగురు నిందితుల అరెస్ట్
- మూడు జిల్లాల్లో చోరీలు
- కొవ్వూరు డీఎస్పీ రామారావు వెల్లడి


పోలీసులు స్వాధీనం చేసుకున్న రాగి దిమ్మెలు

దేవరపల్లి: మూడు జిల్లాల్లో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లలోని రాగితీగ చోరీకి పాల్పడుతున్న ముఠాను కొవ్వూరు డీఎస్పీ కేసీహెచ్ రామారావు సారథ్యంలో దేవరపల్లి పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా నుంచి 225 రాగి దిమ్మెలు, 100 కిలోల రాగితీగ (మొత్తం 600 కిలోల రాగితీగ)ను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు రూ.6 లక్షలని కొవ్వూరు డీఎస్పీ రామారావు తెలిపారు. స్థానిక పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన వివరాలు వెల్లడించారు. ఏలూరు రేంజ్ పరిధిలోని తూర్పు, పశ్చిమ, కాకినాడ జిల్లాల పొలాల్లోని విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను నలుగురు సభ్యులు గల ముఠా బద్దలు కొట్టి దానిలోని రాగి దిమ్మలు, రాగివైరును దొంగిలించి పాత ఇనుము కొనుగోలుదారులకు విక్రయిస్తోంది. అంబేడ్కర్ కోనసీమ జిల్లా, పి.గన్నవరం మండలం, గంటి పెదపూడిలోని రాజీవ్ కాలనీకి చెందిన సుంకర సతీష్ (శివ), కాకినాడ జిల్లా జగ్గంపేట మండలం రామవరంలోని రంగవల్లి నగర్‌కు చెందిన కొమ్మిరెడ్డి దుర్గ, రంగవల్లి నగర్‌కే చెందిన నెల్లూరి లోవరాజు, అదే మండలంలోని ఉప్పర రామవరానికి చెందిన నక్కా నాగేంద్ర కుమార్ (పొట్టి) ఓ ముఠాగా ఏర్పడి ఈ తరహా చోరీలకు పాల్పడుతున్నారు.

దొంగతనాల వివరాలు

కాకినాడ జిల్లా పెద్దాపురంలో 17, సామర్లకోటలో 5, ఏలేశ్వరంలో 2, అన్నవరంలో 3, మొత్తం 17 ట్రాన్స్‌ఫార్మర్ల చోరీకి పాల్పడ్డారు. పశ్చిమ గోదావరి జిల్లా తాడేపల్లిగూడెం రూరల్‌లో 42 ట్రాన్స్‌ఫార్మర్లు, తూర్పుగోదావరి జిల్లా దేవరపల్లిలో 7, గోపాలపురంలో 2, నల్లజర్లలో 10, కొవ్వూరు టౌన్‌లో 2, చాగల్లులో 2, సమిశ్రగూడెంలో 2, రంగంపేటలో 16, బిక్కవోలులో 10, మొత్తం 51 ట్రాన్స్‌ఫార్మర్లను చోరీ చేశారు.

స్వాధీన పరుచుకున్న సొత్తు వివరాలు

226 కాపర్ దిమ్మెలు (ఒక్కొక్క దిమ్మ 1.5 నుంచి 2 కిలోలు), కాపర్ వైరు 100 కిలోలు మొత్తం 600 కిలోలు. చోరీ సొత్తు విలువ సుమారు రూ.6 లక్షలని డీఎస్పీ రామారావు తెలిపారు. నిందితులు సుంకర సతీష్ తన గ్రామం గంటి పెదపూడిలో పాత ఇనుము వ్యాపారం చేస్తుండగా, కొమ్మిరెడ్డి దుర్గ, నెల్లూరి లోవరాజు ఒకే గ్రామానికి చెందిన వారు. వారిద్దరూ ఇంటింటికీ తిరిగి ఉల్లిపాయలను పాత ఇనుముకు, సొమ్ముకు విక్రయిస్తుంటారు. పాత ఇనుము కూడా కొనుగోలు చేసి సుంకర సతీష్‌కు అమ్మేవారు. ఈ నేపథ్యంలో నలుగురూ ముఠాగా ఏర్పడి సతీష్‌కు చెందిన మినీ వ్యాన్‌ను, నక్కా నాగేంద్రకు చెందిన గ్లామర్ బైక్‌పై సుమారు ఏడాదిన్నరగా రాత్రి వేళ పొలాల్లోని ట్రాన్స్‌ఫార్మర్లను బద్దలు కొట్టి, రాగివైరును వేరు చేసి గుర్తు తెలియని వ్యక్తులకు అమ్ముతున్నారు. ఈ క్రమంలో సుంకర సతీష్ తన వ్యాపాన్ని విస్తరించి కొంత కాలం క్రితం తాడేపల్లిగూడెం డంపింగ్ యార్డు వద్ద దుకాణం ఏర్పాటు చేశారు. ఆ ముఠా సభ్యులు దొంగిలించిన రాగి వైరును కరిగించి దిమ్మెలుగా తయారు చేశాడు. అలాంటి 225 దిమ్మలను ఆరు మూటల్లో ఉంచి వ్యాన్‌లో అమ్మడానికి విజయవాడ తీసుకు వెళుతుండగా దేవరపల్లి ఎస్సై కె.శ్రీహరిరావు, సిబ్బంది వి.చంద్రశేఖర్, వి.చక్రవర్తి, ఎస్‌కే సలీం, వి. రాంగోపాల్, రామారావు రాజమహేంద్రవరం సీసీఎస్ ఎస్సై కె.రజని, సిబ్బంది కలిసి దేవరపల్లి డైమండ్ జంక్షన్ వద్ద పట్టుకున్నట్టు డీఎస్పీ రామారావు వివరించారు. దేవరపల్లి సీఐ పి. బాలసురేష్ బాబు, రాజమహేంద్రవరం సీసీఎస్ ఎస్సై కె.రజనీ కుమార్, ఆధ్వర్యంలో దేవరపల్లి ఎస్సై శ్రీహరిరావు కేసు నమోదు చేసి, నిందితులను అరెస్ట్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మూణ్ణాళ్ల ముచ్చటేనా..

- ఆజాద్ చౌక్‌లో పనిచేయని టవర్ క్లాక్
- తరచూ మరమ్మతులు



టవర్ క్లాక్‌లో ఆగిపోయిన గడియారం

రాజమహేంద్రవరం సిటీ: ఆజాద్ చౌక్ సెంటర్‌లోని నాలుగు రోడ్ల కూడలిలో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన టవర్ క్లాక్ (గడియారం) పనిచేయడం లేదు. రాజమహేంద్రవరం అర్బన్ డవలప్‌మెంట్ అథారిటీ (రుడా) ఆధ్వర్యంలో ఏడాది క్రితం సుమారు రూ. 18 లక్షలతో ఈ టవర్ క్లాక్ ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి తరచూ మరమ్మతులకు గురవుతూనే ఉంది. దీనిపై ఎన్నిసార్లు అధికారులకు విజ్ఞప్తి చేసినా ఫలితం లేకుండా పోయిందని స్థానిక ముస్లిం నాయకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీపంలోని దేవీచౌక్ సెంటర్‌లో టవర్ క్లాక్ ఏళ్ల తరబడి నిర్విరామంగా పని చేస్తుందని, కానీ ఆజాద్ చౌక్ సెంటర్‌లో టవర్ క్లాక్ తరచూ మరమ్మతులకు గురవుతోందన్నారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పాల్ ల్యాబ్‌లతో ఆదర్శ విద్యా బోధన


శిక్షణలో మాట్లాడుతున్న శ్రీనివాసులు రెడ్డి

కంబాలచెరువు: సంప్రదాయ బోధనా విధానాలలో కొనసాగుతున్న అభ్యాస అవాంతరాల ఒత్తిడిని అధిగమించడమే లక్ష్యంగా పర్సనలైజ్డ్ అడాప్టివ్ లెర్నింగ్ (పాల్) ల్యాబ్‌లు ఏర్పడ్డాయని రాష్ట్ర సమగ్ర శిక్షా అదనపు పథకం సంచాలకులు బి.శ్రీనివాసులు రెడ్డి అన్నారు. స్థానిక గరిమెళ్ల సత్యనారాయణ అత్యున్నత శిక్షణ అధ్యయన సంస్థ (ట్రైనింగ్ కాలేజీ)లో మంగళవారం పాల్ ల్యాబ్ ఉన్న పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గణితం, ఆంగ్లం ఉపాధ్యాయులకు ఒక్క రోజు శిక్షణ నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన శ్రీనివాసులు రెడ్డి మాట్లాడుతూ పాల్ ల్యాబ్‌ల ద్వారా ఆదర్శవంతమైన విద్యా వాతావరణం రూపొందించవచ్చన్నారు. విద్యార్థుల విభిన్న అభ్యసన అవసరాలు, అభ్యాస ప్రాధాన్యతలు, అభ్యాస స్థాయి శైలి, పురోగతిని అంచనా వేసి, వారిని సరైన దిశలో ముందుకు తీసుకువెళ్లేందుకు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. గత విద్యా సంవత్సరంలో ఏర్పడిన లోటుపాట్లను సవరించుకొని, రానున్న విద్యా సంవత్సరంలో జిల్లా స్థాయిలో పాల్ ల్యాబ్‌లను సమర్థంగా నిర్వహించాలన్నారు. విద్యార్థుల సందేహాలను రెమిడియల్ టీచింగ్ ద్వారా నివృత్తి చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఏడీ శ్రీనివాస్‌సింగ్, జోన్ 2 ప్రాంతీయ విద్యా సంచాలకులు బి.నాగమణి, డీఈవో కె.వాసుదేవరావు, జిల్లా సమగ్ర శిక్షా అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్ ఎస్.సుభాషిణి, రాష్ట్ర పాల్ ల్యాబ్ కో ఆర్డినేటర్ బి.కిషోర్, రాష్ట్ర పరిశీలకురాలు నాగమణి, జిల్లా సమగ్ర శిక్షా సెక్టోరియల్ అధికారులు పాల్గొన్నారు.

మాజీ ప్రధాని రాజీవ్ గాంధీకి నివాళి

రాజమహేంద్రవరం సిటీ: దేశం సాంకేతికంగా ప్రగతి సాధించడానికి కృషి చేసిన మహనీయుడు మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ అని కాంగ్రెస్ నగర అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ అన్నారు. రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా స్థానిక కృష్ణా నగర్‌లోని పార్టీ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యులు బెజవాడ రంగారావు, చింతాడ వెంకటేశ్వరరావు, నాయకులు చామర్తి లీలావతి, మరడాపు రాజు, శ్రీను పాల్గొన్నారు.

దేవుని కోనేరులో పనుల నిలుపుదల

మధురపూడి: కోరుకొండలోని శ్రీలక్ష్మీ నరసింహ స్వామి కోనేట్లో నిర్వహిస్తున్న మట్టి తవ్వకాలను తహసీల్దార్ రాజ్యలక్ష్మి మంగళవారం నిలిపివేయించారు. పంచాయతీ తీర్మానం లేకపోకుండా పనులు నిర్వహిస్తుండడంతో జేసీబీని కార్యాలయం ఆవరణలో ఉంచారు. సంబంధిత పంచాయతీ కార్యదర్శి రమేష్‌బాబుతో పనుల విషయంపై మాట్లాడారు. పనులు జరుగుతున్న తీరుపై ఫిర్యాదు చేయకుండా జాప్యం చేయడంపై ఆరా తీశారు. పంచాయతీ తీర్మానం జరిగే వరకూ పనులను ఆపాలన్నారు.

మధురంలో గరళం

- కొందరు వ్యాపారుల అత్యాశ
- పండ్లను మాగబెట్టేందుకు రసాయనాల వినియోగం
- తింటే అనారోగ్యమే..

రాజమహేంద్రవరం రూరల్: వేసవి కాలం అంటే మామిడి పండ్ల సీజన్. చూడగానే నోరూరించే మామిడి పండ్లను ఇష్టపడని వారంటూ ఉండరు. పిల్లల నుంచి పెద్దవాళ్ల వరకూ వీటిని రుచికి ఫిదా అవుతారు. ఈ కాలంలో చాలా మందికి మామిడి పండ్ల విక్రయాలే జీవనాధారం. రోడ్ల పక్కన, షాపులలో, తోపుడు బండ్లపై విక్రయాలు జరుగుతూ ఉంటాయి. అయితే లేత పసుపురంగులో మెరిసిపోతూ కనిపించే మామిడి పండ్ల వెనుక అనారోగ్యం కూడా దాగుంది. కొందరు వ్యాపారులు అత్యాశతో కార్బైడ్ వంటి రసాయనాలతో పండ్లను మాగబెట్టి విక్రయిస్తున్నారు. దీనివల్ల రంగు చాలా బాగా కనిపిస్తుంది. చూడగానే ప్రజలు వాటిని కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఎలాంటి లైసెన్స్ లేకుండా పండ్లను మగ్గబెట్టే కేంద్రాలను నిర్వహిస్తున్నా, అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తుండటం అనుమానాలకు తావిస్తోంది. నిబంధనల ప్రకారం వ్యాపారులు అనుమతి తీసుకోవాల్సి ఉంది. వీటిని పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో రాజమహేంద్రవరంతో పాటు పరిసర ప్రాంతాలలో యథేచ్ఛగా వ్యాపారాలు నిర్వహిస్తున్నారు. రాజమహేంద్రవరం పరిసర ప్రాంతాల నుంచి మామిడి కాయలను తీసుకువచ్చి రసాయనాలతో పండిస్తున్నారు.

రోగాల బారిన పడే ప్రమాదం

కార్బైడ్‌తో మాగబెట్టిన పండ్లను తింటే అల్సర్, నాడి, కాలేయం, చర్మ సంబంధ వ్యాధులు వస్తాయని స్థానిక ప్రభుత్వ వైద్యాధికారులు చెబుతున్నారు. చిన్నారులకు అనారోగ్యం కలుగుతుందన్నారు. గర్భిణులు ఈ పండ్లు తింటే పుట్టబోయే శిశువులకు జన్యుపరమైన లోపాలు, అనారోగ్యం, ఫిట్స్, జ్ఞాపకశక్తి తగ్గడం, చర్మంపై దద్దుర్లు రావటం, నల్లబడటం, శ్వాసకోశ వ్యాధులు తదితర దుష్పరిణామాలు కూడా వచ్చే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.

గుర్తించడం ఇలా...

కృత్రిమంగా పండించిన పండు అంతా ఒకే రంగు ఉంటుంది. కోసినప్పుడు లోపలి భాగం పక్వంగానూ, మిగతా సగం అపరిపక్వంగా ఉండి సరైన రుచి లేకుండా ఉంటుంది. పండితే ఉండదు. కోసినప్పుడు లోపలి భాగం మొత్తం ఒకే రకమైన పరిపక్వం ఉంటుంది. ఎథిలీన్ ఛాంబర్స్‌లో మగ్గిన పండ్లు మాత్రం ఒకే రకమైన రంగు, రుచి, వాసనతో సహజ పరిపక్వతకు దగ్గరగా ఉంటుంది. పండ్లను నీటితో బాగా శుభ్రం చేసి తొక్కను తీసి తింటే కొంత వరకు రసాయనాల ప్రభావం తగ్గుతుంది.


విక్రయానికి సిద్ధంగా ఉన్న మామిడిపండ్లు

టీకాల లక్ష్యాన్ని నూరు శాతం సాధించాలి


వర్క్‌షాప్‌లో పాల్గొన్న వైద్యాధికారులు

కంబాలచెరువు: వ్యాధి నిరోధిక టీకాలు, ఆరోగ్య కార్యక్రమాల లక్ష్యాలను ప్రతి నెలా నూరు శాతం పూర్తి చేయాలని జిల్లాలోని పీహెచ్‌సీ వైద్యాధికారులు, మాతాశిశు సంరక్షణ కార్యకర్తలకు జిల్లా వైద్య,ఆరోగ్య శాఖాధికారి (డీఎంఅండ్‌హెచ్‌వో) డాక్టర్ కె.వెంకటేశ్వరరావు ఆదేశించారు. స్థానిక వెంకటేశ్వర ఆనం కళాకేంద్రంలో మంగళవారం వర్క్ షాప్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంఅండ్‌హెచ్‌వో మాట్లాడుతూ జిల్లాలో ఐదేళ్ల లోపు పిల్లలకు వ్యాధి నిరోధక టీకాల లక్ష్యాలను పూర్తి చేయాలన్నారు. ప్రతి ప్రభుత్వ ఆసుపత్రిలో తప్పనిసరిగా ప్రసవాలు చేయించాలన్నారు. ఆరోగ్య సురక్ష క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసునేలా చర్యలు తీసుకోవాలన్నారు. వర్క్ షాప్‌ను గుంటూరు కు చెందిన సర్వేయన్స్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ జాన్ జుడే జాషువా నిర్వహించారు. కార్యక్రమంలో ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ ఎస్.రాజకుమారి. డిప్యూటీ డీఎంహెచ్‌వోలు డాక్టర్ శ్రీహరి, డాక్టర్ సంధ్య, జిల్లా ఆరోగ్యశ్రీ కోఆర్డినేటర్ డాక్టర్ ప్రియాంక పాల్గొన్నారు.